International Journal of Multidisciplinary Trends

**E-ISSN:** 2709-9369
**P-ISSN:** 2709-9350
www.multisubjectjournal.com
IJMT 2022; 4(2): 207-210
Received: 01-07-2022
Accepted: 05-08-2022

**డాII వి.నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్, ఆధునిక భారతీయ భాషలు, మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ, ఇండియా

**Corresponding Author:**
**డాII వి.నారాయణప్ప**
అసోసియేట్ ప్రొఫెసర్, ఆధునిక భారతీయ భాషలు, మరియు సాహిత్య అధ్యయన శాఖ, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ, ఇండియా

# ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవం - ఒడ్డె ఓబన్న పాత్ర: ఒక విశ్లేషణాత్మక సమీక్ష

**డాII వి.నారాయణప్ప**

## అమూర్త
క్రీ.శ.1846లో రాయలసీమ ప్రాంతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారు లేవదీసిన రాయలసీమ రైతుల పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంగా మారింది. ఈ సంగ్రామ చరిత్రలోఒడ్డె ఓబన్న, గోసాయి వెంకన్న పేర్లు ప్రముఖంగా వినబడుతాయి. గోసాయి వెంకన్న, నరసింహారెడ్డికి ఆధ్యాత్మిక గురువు అయితే, ఒడ్డె ఓబన్న రెడ్డిగారి సైన్యానికి ముఖ్యనాయకుడు. క్రీ.శ.1846 అక్టోబరు 6వ తేదీన ఒడ్డె ఓబన్న వీరమరణం పొందిన దినంగా చెబుతున్నారు. 1847 ఫిబ్రవరి 22వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు కోవెలకుంట్లలో సుమారు రెండువేల మంది ప్రజల సమక్షంలో నరసింహారెడ్డిగారిని అతి క్రూరంగా ఉరితీసి చంపారు ఆనాటి కుంఫిణీ ప్రభుత్వంవారు. ఆ రోజును చీకటిరోజుగా చరిత్ర పేర్కొంటుంది. ఆ సంఘటనలను ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు ‘‘ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవం - ఒడ్డె ఓబన్నపాత్ర” అనే గ్రంథాన్ని రచించారు. ఆ గ్రంథాన్ని నేను విశ్లేషణాత్మకంగా సమీక్షించాను.

**కీలక పదాలు:** తవర్జీ, కుంఫిణీ ప్రభుత్వం, కట్టుబడి, తూకుమాను, బంకోలు శిక్ష

## పరిచయం
భారతీయులమైన మనం ఆంగ్లేయుల పాలనలో బానిసలుగా బతుకులను సాగించిన తీరు అందరికీ తెలిసిన విషయమే. ఈ భరతఖండ విముక్తి కోసం ప్రాణాలొడ్డిన త్యాగధనులు ఎందురో ఉన్నారు. మొదట ప్రధానంగా పేర్కొనదగిన ఆ త్యాగధనులు ఎవరో కాదు. వారే పాళేగార్లు. పాళేగార్ల పాత్ర చాలా ప్రముఖమైంది. వారు కొన్ని ఊళ్ళను తమ కింద ఉంచుకొని సంస్థానాలుగా ఏర్పరుచుకొని ఆయా ప్రాంతాలను ఏలేవారు. ఆంగ్లేయులు మన దేశానికి రాకముందు భారతదేశంలో సుమారు 450కి పైగా ఇలాంటి సంస్థానాలుండేవి. అలాంటి సంస్థానాలలో ఆంధ్రదేశంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారిదొక సంస్థానం. అతడొక స్వాతంత్ర్య సమరయోధుడు. అతడు దేశస్వాతంత్ర్యం కోసం ఆంగ్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి క్రీ.శ.1847 ఫిబ్రవరి 22వ తేదీన ఉరికంబమెక్కి ప్రాణాలను పణంగా పెట్టి వీర మరణం పొందారు. అప్పటి నుంచి అతని గురించిన కథనాలు జానపద సాహిత్య రూపంలో ప్రజల నోళ్ళలో నానాయి. ఇంకా ఇతర సాహిత్య ప్రక్రియలయిన నవలల రూపంలోనూ, నాటకాల రూపంలోను, పద్యకావ్యాల రూపంలోనూ కథనాలు వచ్చాయి. ఇవి అన్నీ చాలా వరకూ ప్రముఖ పరిశోధకులు ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారి అద్వితీయమైన పరిశోధనల ఫలితంగా వెలుగులోకి వచ్చాయి.

## సాహిత్యావలోకనం

ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని గురించి, బుడ్డా వెంగళరెడ్డిగారిని గురించి ''రేనాటి సూర్యచంద్రులు'' అనే పేర్తో 1999లో మొదటి సంపుటాన్ని, 2000లో రెండవ సంపుటాన్ని, 2011లో మూడవ సంపుటాన్ని తంగిరాల వారే ప్రచురించారు. ఈ ప్రామాణిక బృహద్గ్రంథాలను ఆధారంగా చేసుకొని తెలుగులో 'సైరా' అనే సినిమా కూడా వచ్చింది.

ఈ సినిమా రాకముందే ఒకానొక సాహిత్య సభలో తంగిరాలవారు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారిని గురించి ప్రసంగిస్తూ, నరసింహారెడ్డికి అన్నివిధాల నమ్మిన బంటుగా ఒడ్డె ఓబన్న ఉండేవాడని; నరసింహారెడ్డికి సేనాధ్యక్షునిగానూ ఉండి ఆంగ్లేయులు విధించిన కఠిన శిక్షలకు గురి అయ్యాడనీ ప్రస్తావించారు.

ఈ ప్రసంగాన్ని విన్న శ్రీ వడ్డె బాలనరసింహుడగారు చాలా ఉత్తేజితులయ్యారు. వీరు ఒడ్డె ఓబన్నగారి వంశంలో 6వ తరానికి చెందినవారు. వీరు నంద్యాలలో ''వడ్డే ఓబన్న సేవాసమితి''ని ఏర్పరచుకున్నారు. ఈ సేవా సమితి ద్వారా వెనకబడిన వడ్డెకులంవారికి ఒక వైపు సేవలందిస్తూనే, ఒడ్డె ఓబన్నగారి చరిత్రను వెలికి తీసి రాయించే ప్రయత్నం చేశారు. ఈ ఓబన్నగారి చరిత్రను ప్రామాణికంగా రాయటానికి ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావు గారే తగిన అర్హత గలవారని గుర్తించారు. కొన్నాళ్ళ తర్వాత బాలనరసింహుడు గారు 'ఒడ్డె ఓబన్నగారి చరిత్రను గురించి మీరు రాసి ఇస్తే బాగుంటుంద'ని సుబ్బారావుగారిని అభ్యర్థించారు. వీరి వినయ అభ్యర్థనకు తంగిరాలవారు వయస్సు మీదపడి 87 ఏండ్లు దాటినా... ఎంతో ఉదార మనస్సుతో ఓబన్నను గురించి రాయటానికి అంగీకరించారు. అలాగే ఎంతో శ్రమకోర్చి ''ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవం - ఒడ్డె ఓబన్నపాత్ర'' అనే పేర్తో ఈ పరిశోధన గ్రంథాన్ని అందించారు. 128 పుటలు గల ఈ గ్రంథాన్ని శ్రీవడ్డె బాల నరసింహుడు గారు 'వడ్డే ఓబన్న సేవాసమితి' ద్వారా నంద్యాలలో ప్రచురించారు. దీని ముద్రాపకులు విజయవాడలోని కావ్య ప్రింటర్స్.

ఇది ఒక అద్వితీయమైన గ్రంథం. దీన్ని బట్టి చూస్తే, క్రీ.శ.1846లో రాయలసీమలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారు లేవదీసిన రాయలసీమ రైతుల పోరాటం స్వాతంత్ర్య సంగ్రామంగా మారింది. ఇది క్రీ.శ.1847 ఫిబ్రవరి 22వ తేదీన నరసింహారెడ్డిని ఉరితీయడంతో ఈ విప్లవ కథనం ముగుస్తుంది. కాబట్టి, ఈ కథనమంతా 7 (ఏడు) నెలలు పాటు సాగిందని తెలుస్తుంది. అయినా ఇది ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి నాందిగా నిలిచిపోయింది.

ఈ నరసింహారెడ్డిగారి కథనం చరిత్రకెక్కినట్లు ఒడ్డె ఓబన్న కథనం చరిత్ర పుటలకెక్కలేదని కొన్ని అపోహలు వచ్చాయి. ఈ అపోహలకు సమాధానంగా ఈ గ్రంథంలో 7వ పుటలో ''ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగారి విప్లవాన్ని గురించి చెప్పేటప్పుడు, ఆయన ముఖ్య అనుచరులైన గోసాయి వెంకన్న, ఒడ్డె ఓబన్నల ప్రసక్తి లేకుండా ఏ రచనా ఉండటానికి అవకాశం లేదు. ఒడ్డె ఓబన్న ప్రసక్తి ప్రముఖంగా ఉన్నది'' అని ఉటంకించి, కొన్ని ఆకరాలు - గ్రంథాలను పేర్కొన్నారు తంగిరాలవారు.

1925లో కలవటాల జయరామారావుగారు రచించిన 'రేనాటి వీరుడు'అనే నవలలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న, ఒడ్డె ఓబన్న అనే మూడు ప్రధాన పాత్రలతో నడిచిందని, ఎనిమిదవ ప్రకరణం 'ఒడ్డె ఓబన్న' పేర్తోనే ఉందనీ, ఇంకా 9, 10, 11 ప్రకరణాలలో ఓబన్న ప్రసక్తి ఉన్న ఘట్టాలను ఉదాహరించారు సుబ్బారావుగారు.

ఆ తర్వాత ఒక చోట పిచ్చుకుంట్లువారు పాడే పాటలో –

''నారసింహారెడ్డి ఎంబడి
గోసాయి ఎంకన్న
ఒడ్డే ఓబన్నేమొ ...... (పుట.32) అని ఉంది.

దీని తర్వాత 1976లో పాణ్యం నరసరామయ్యగారు ''స్వాతంత్ర్య వీరుడు'' అనే పద్యకావ్యాన్ని రచించారు. అక్కడా ఒడ్డె ఓబన్న ప్రసక్తి వచ్చింది. ఇందులో ట్రెజరీ దగ్గర కాపలా కాస్తున్న హరిసింగ్ చేతిలోని తుపాకిని నరసింహారెడ్డి లాక్కున్నారు. వాడు రెడ్డిపై కత్తి దూశాడు. దానిని చూసి

అంగరక్షకుడైన ఓబన్న సహించలేక హరిసింగును పొడిచి చంపివేశాడు. ఇటు ఓబన్నలో స్వామిభక్తి, ఆవేశం; అటు హరిసింగ్ లో రాజభక్తి కనపడుతుంది. ఈ ఘట్టాలను సుబ్బరావుగారు 37వ పేజీలో ఎత్తి చూపారు.
ఆ తర్వాత 1991లో శ్రీ పల్లేటి లక్ష్మి కులశేఖర్ గారు ''విప్లవ సింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి" అనే ఒక చారిత్రాత్మక నాటకాన్ని రాశారు. ఇందులో కూడా ఒడ్డె ఓబన్న వచ్చే సన్నివేశాలు మొదటి అంకం నుండి ఐదవ అంకం వరకు ప్రముఖంగా ఉన్నాయని చెప్పారు సుబ్బారావుగారు. అలాగే ఐదవ అంకం - మూడవ దృశ్యంలో గోసాయి వెంకన్న - ఓబన్న నరసింహస్వామికి మొక్కుబడి చెల్లించి బయటరాగానే మల్లారెడ్డి బల్లానికి బలైనారు. ఓబన్న తన గుండెమీద తగిలిన దెబ్బకు తల్లడిల్లాడు. బాధతో మెలికలు తిరిగి నరసింహారెడ్డి చేతుల్లోకి చేరాడు. చేరి ''దొరా! నేను పానాలు అరసేతిలో వుంచుకొని, మీ పాదాల దగ్గర వదలాలని వచ్చినాను దొరా! నేనింక బతకను దొరా! మేము సచ్చిపోయినామని మీలో పౌరుషం సచ్చిపోకూడదండి దొరా! ఈ పోరాటం ఆగనీయొద్దుదొరా! సాగిపొండి. మీరు తప్పక విజయం పొందుతారు. జయం మనదే! మీ కీరితి భారతమాత కిరీటం మీద మెరిసిపోవాల! ఈ పోరాటం ఆగకుండా సాగాలి" అంటూ తన నెత్తురుతో సిందూరం దిద్దాడు. ఈ దృశ్యం - ఓబన్నగారి మాటలు చూస్తే ఓబన్నలో దేశభక్తి, స్వామిభక్తి రెండూ కనబడుతాయి. ఇక్కడ నాటకకర్త ఓబన్నకు తగిన పాత్రోచిత భాషను కూడా వాడారు. ఈ దృశ్యం ప్రతి భారతీయుని మనస్సును కరిగించి స్ఫూర్తినిచ్చే దృశ్యంగా నిలుస్తుంది.
ఒడ్డె ఓబన్న స్వగ్రామం నొసం దగ్గర అక్కంపల్లె అనీ, ఓబన్నకు బుఱ్ఱ మీసాలుండేవని, నిలువు నామం ధరించేవాడని పెద్దలవల్ల విన్న సంగతిని పేర్కొన్నారు బాలనరసింహుడుగారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, గోసాయి వెంకన్న - ఒడ్డె ఓబన్నల మరణం గురించి మరొక ఉపశీర్షికలో

నల్లమల అడవులలో అహోబల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సమీపంలో ముగ్గురూ సమావేశమయ్యారని, ఆంగ్ల సైనికులు వెంకన్నను, ఓబన్నను తరుముకొని వెళ్ళి తుపాకులతో కాల్చి చంపారనీ; నరసింహారెడ్డిగారు అక్కడి నుండి పారిపోయి ఆల్వకొండ సమీపంలోని జగన్నాథ స్వామి దేవాలయంలో పట్టుబడ్డారనీ, కోవెల కుంట్ల కలెక్టరు ఏమీ విచారించకుండానే ఉరిశిక్ష వేసి, కోవెల కుంట్లలో మధ్యాహ్నం 2 గంటల వేళ ఉరితీశారని, కలవటాల జయరామారావుగారు 'రేనాటి వీరుడు' నవలలో రాశారు. కాని ఈ వ్రాతలు సరికావు. ఆయన యుద్ధం చేసి పట్టుబడ్డాడుకాని, ఒంటరిగా ఉండి పట్టుబడలేదు అని సుబ్బారావు గారు చెప్పారు. ఇంకా - అవి అన్నీ కల్పనలుగా భావించాలి. వారు కడప కలెక్టరు J.H.Cochrane మద్రాసు గవర్నర్‌కు రాసిన లేఖలు చూడలేదు అని కూడా చెప్పారు సుబ్బారావుగారు. అంతేకాదు ఆ లేఖల ఆధారంగా –
''క్రీ.శ.1846 అక్టోబరు 6వ తేదీన 'పేరుసోమల' కొండల్లో జగన్నాథ దేవాలయం దగ్గర ఒక యుద్ధం (3వ యుద్ధం) జరిగింది. ఆ యుద్ధంలో కాలికి గుండుదెబ్బ తగలడంతో నారసింహారెడ్డి ఎటూ తప్పించుకోలేక కాక్రేన్‌కు పట్టుబడ్డాడు. ఈ యుద్ధంలో చనిపోయిన వారిలోకాని, గాయపడిన వారిలోకాని, పట్టుబడిన వారిలోకాని గోసాయి వెంకన్న - ఒడ్డె ఓబన్న ఉండి ఉండవచ్చును. కాబట్టి క్రీ.శ.1846 అక్టోబరు 6వ తేదీని ఒడ్డె ఓబన్న వీరమరణం పొందిన దినంగా మనం భావించవచ్చును. తప్పులేదు. దీనిని వడ్డె కులంవారు ఓబన్న వర్ధంతిగా పాటించవచ్చును అని సుబ్బారావుగారు నిక్కచ్చిగా చెప్పారు. అనంతరం ''కుంఫిణివారి ప్రభుత్వం జిల్లా కేంద్రమైన కడపలో నరసింహారెడ్డిని విచారించింది. 1847 జనవరి 9వ తేదీన 'మజ్జరి నరసింహారెడ్డి' గారికి ఉరిశిక్ష విధించారు. ఉరి తర్వాత రెడ్డిగారి శరీరాన్ని గొలుసులతో బంధించి, 'తూకుమాను'ను వ్రేలాడదీసి ఉంచవలసిందిగా తీర్పు. ఈ తీర్పుకు మద్రాసులోని గవర్నరు ఆమోదముద్ర 1847 ఫిబ్రవరి 6వ తేదీన పడింది. దాని ప్రకారం 1847 ఫిబ్రవరి 22వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు కోవెలకుంట్లలో రెండువేల మంది ప్రజల సమక్షంలో నరసింహారెడ్డిగారిని అతిక్రూరంగా ఉరితీశారు" అని సుబ్బారావుగారు సోపపత్తికంగా వివరించారు. ఇది సుబ్బారావుగారి పరిశోధనా పటిమకు తార్కాణం.
ఇంతేకాదు, శ్రీ తన్నీరు లక్ష్మణస్వామి ''అఖిల భారత వడ్డెరాజుల చరిత్ర" అనే గ్రంథాన్ని రాసి

2014లో ప్రచురించారు. ''దీనిని ప్రతి వడ్డెర కులంవారు చదివితీరాలి. ఫలితంగా వారి కులచరిత్ర, సంస్కృతి, గొప్పతనం తెలుస్తుంది" అని ఈ గ్రంథంలోని అనేక విషయాలను పరిచయం చేశారు. ఈ పరిచయం ఎంతో అవగాహన ఉంటే తప్ప వివరించలేరు.

ఇంకా - Edgar Thurston ఇంగ్లీషులో రాసిన "Castes and Tribes of Southern India" అనే రచనను తెలుగులోకి అనువదింపజేసి అందించారు సుబ్బారావుగారు.

తర్వాత వడ్డె బాల నరసింహుడు రచించిన వడ్డే ఓబన్న వ్యాసాన్ని అనుబంధం-1లో పొందుపర్చారు. పాఠకులకు సామాన్యంగా కలిగే అనుమానాలకు, ప్రశ్నలకూ సంపాదక వ్యాఖ్యలో సోదాహరణంగా వివరించారు గ్రంథకర్త.

ఇందులో ప్రతి స్పందన, సమాపనం, ఒడ్డె ఓబన్న వంశ వృక్షం కూడా చేర్చారు. ఈ గ్రంథంలోని ఫోటోలలో ప్రతి ఒక్క ఫోటో ఒక్కొక్క చరిత్రాంశాన్ని అందిస్తున్నట్లున్నాయి.

## ముగింపు

ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు చరిత్రను వక్రీకరించి రాయకూడదనే ఉద్దేశంతో ఒడ్డె ఓబన్నను చరిత్రకు దగ్గరగా చిత్రీకరించారు. తంగిరాలవారి ఈ పరిశోధన గ్రంథంలో వేదాల సారమంతా వేమన పద్యాలలో ఉన్నట్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవ గాథతో పాటు ఒడ్డె ఓబన్న పాత్రను అత్యద్భుతంగా పూస గుచ్చినట్లు కావలసిన ఆధారాలతో సహా పొందుపర్చారు. ఈ పరిశోధన గ్రంథం పాఠకులకు జిజ్ఞాస కలిగిస్తుంది. ఇందులో రచయిత శ్రమ, దీన్ని రాయించిన శ్రీవడ్డె బాల నరసింహుడుగారి ప్రయత్నం ఫలితంగా పాఠకులకు చాలా ఉపయోగపడుతుంది.

## ప్రస్తావనలు


1. వెంకట సుబ్బారావు, తంగిరాల. (సం.). 2011. రేనాటి సూర్యచంద్రులు (3వ సంపుటం). బెంగుళూరు: శ్రీ.రస.
2. వెంకట సుబ్బారావు, తంగిరాల. 2017. రేనాటి సూర్యచంద్రులు. ఉయ్యాలవాడ: రేనాటి సూర్యచంద్రుల స్మారక సమితి.
3. అజీజ్, యస్.డి.వి. 2017. పాలెగాడు, విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. వెంకట సుబ్బారావు, తంగిరాల. 2022. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విప్లవం-ఒడ్డె ఓబన్న పాత్ర. నంద్యాల:
5. వడ్డె ఓబన్న సేవాసమితి. (*సమీక్షకు గ్రహించిన ప్రధాన ఆధార గ్రంథం) జయరామారావు, కలవటాల. 2022. రేనాటి వీరుడు. నంద్యాల: వాయిస్ ట్రస్ట్.
6. అజీజ్, యస్.డి.వి. 2022. ఓబన్న, నంద్యాల: వాయిస్ ట్రస్ట్.